ప్రజాశక్తి

ఆదివారం 25 మే 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

పంట అమ్ముడుపోక..
అప్పులు తీర్చలేక..

- పురుగుమందు తాగి..
- నల్లబర్లీ కౌలు రైతు
- ఆత్మహత్య

శ్రీనాథ్ (ఫైల్)

ప్రజాశక్తి-పంగులూరు

నల్లబర్లీ పొగాకుతో పాటు శనగలు, జూట్ పంటలు అమ్ముడు పోక.. అప్పులు తీర్చలేక.. ఓ యువ కౌలు రైతు బలవన్మరణం చెందాడు. వ్యవసాయాన్ని నమ్ముకొని.. నష్టాల పాలై.. పురుగుమందు తాగి.. ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రతి ఏటా వ్యవసాయంలో నష్టాలు వస్తున్నా.. ఈ సంవత్సరమైనా కలిసి రాకపోద్దా.. అను కుంటూ.. చివరకు ఆత్మహత్యే శరణ్యమని భావించాడు. పంగులూరు మండలం, జనక వరం గ్రామానికి చెందిన యువ కౌలు రైతు తలపనేని శ్రీనాథ్ (34) కరోనాకు ముందు బళ్లారిలో వ్యవసాయం చేసేవాడు. అక్కడ వ్యవసాయంలో నష్టాలు చవిచూసి బాగా అప్పుల పాలయ్యాడు. కరోనా సమయంలో సొంత గ్రామం అయినా జనకవరానికి వచ్చి.. ఇక్కడే వ్యవసాయం చేస్తున్నాడు. గత ఐదు సంవత్సరాలుగా ఇక్కడ కౌలు వ్యవసాయం చేస్తున్న శ్రీనాథ్‌కు వ్యవసాయంలో ప్రతి ఏటా నష్టాలే వచ్చాయి. మిర్చి పంటలో విపరీత మైన నష్టాలు రావడంతో ఈ సంవత్సరం మిర్చిని వదిలేసి.. 7 ఎకరాలు కౌలు భూమి తీసుకుని నల్లబర్లీ పొగాకు, శనగ, జూట్ పంటలను సాగు చేశాడు. నల్లబర్లీ పొగాకును ఇంతవరకు ఎవరూ కొనలేదు. శనగలు, జూట్ పంటలు కూడా ఎవరూ కొనలేదు. ఈ పాటికే తన వాటా ఆస్తిగా వచ్చిన రెండు ఎకరాలా 14 సెంట్లు భూమిని అమ్మి కొంత తప్పు తీర్చాడు. ఇది పోనూ గత ఐదేళ్ల నుండి వ్యవసాయం కోసం చేసిన అప్పులు 30 లక్షల రూపాయల వరకు ఉంది. ఒక వైపు పండించిన పంటలు అమ్ముడుపోక, మరో వైపు అప్పు తీర్చమని అప్పుల వాళ్ల నుంచి వచ్చే ఒత్తిడి భరించలేక.. శ్రీనాథ్ శుక్రవారం రాత్రి పొలం వద్దకు వెళ్లి.. తిరిగి రాలేదు. శనివారం ఉదయం శ్రీనాథ్ తండ్రి హరిబాబు పొలం వద్దకు వెళ్ళగా అక్కడ శ్రీనాథ్ విగతజీవిగా పడి ఉన్నాడు. అతని పక్కన పురుగుమందు డబ్బా ▶ 2లో

'ఆత్మహత్య' మాటే వినపడకూడదు..

పొగాకును పరిశీలిస్తున్న అచ్చెన్నాయుడు, గొట్టిపాటి, ఏలూరి

- మాది రైతు
- పక్షపాత ప్రభుత్వం
- బ్లాక్ బర్లీ చివరి ఆకు
- వరకు కొంటాం..
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి
- కింజారపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రైతు పక్షపాత ప్రభుత్వంగా తమ ప్రభుత్వం నిలిచిందని, ఆత్మహత్యల మాట ఈ ప్రభుత్వంలో వినపడరాదని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. పొగాకు రైతులు పండించిన బ్లాక్ బర్లీని చివరి ఆకు కొనే వరకు ప్రభుత్వం అండగా ఉంటుం దని భరోసా ఇచ్చారు. బ్లాక్ బర్లీ పొగాకు రైతులు, బయ్యర్లుగా ఉన్న కంపెనీ ప్రతినిధు లతో ముఖాముఖి కార్యక్రమం మార్టూరు మండలంలోని పర్చూరు శాసనసభ్యులు క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగింది. సుదీర్ఘ చర్చ అనంతరం బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలుపై రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను మంత్రి ప్రకటించారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ బ్లాక్ బర్లీ పొగాకును రెండు గ్రేడ్లతో కొనుగోలు చేస్తామని, కామన్ వెరైటీ క్వింటా ధర రూ.12 వేలకు, లో గ్రేడ్ రకాన్ని రూ.6 వేలతో కొనుగోలు చేయాలని ధరలను నిర్ణయించారు. సాధారణంగా 25 మిలియన్ కిలోల పొగాకు సాగు చేయాలని లక్ష్యం కాగా, ప్రస్తుతం 75 మిలియన్ కిలోల పొగాకు సాగు చేపట్టినట్లు తెలిపారు. ఇదే క్రమంలో అంత ర్జాతీయ మార్కెట్లో కొంత డిమాండ్ తగ్గడమే సంక్షోభానికి కారణమని వివరించారు. మిర్చి, కొబ్బరి, బ్లాక్ బర్లీ, మామిడి పంటలు సంక్షోభంలోకి కూరుకుపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంక్షోభంలో ఉన్న రైతులకు ధైర్యం కల్పించాలి, వారి కోసం కంపెనీలు బాధ్యతతో ముందుకు రావాలని కోరారు. బ్లాక్ బర్లీ పొగాకు పంటను బయ్యర్లు రేపటి నుండే కొనుగోళ్ళు ప్రారంభించా లన్నారు. రాష్ట్ర విద్యుత్ శాఖ ▶ 2లో

మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

తాగునీటి అవసరాలకే సాగర్ నీరు

అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నాగార్జునసాగర్ కుడికాలువ ద్వారా విడుదల చేసిన నీళ్లను కేవలం తాగునీటి అవసరాలకే వినియోగించుకునేలా చూడాలని కలెక్టర్ ఏ.తమీమ్‌అన్సారియా స్పష్టం చేశారు. ఈ దిశగా పర్యవేక్షించేందుకు రెవెన్యూ, పోలీస్, ఆర్‌డబ్ల్యుఎస్, పబ్లిక్ హెల్త్, మున్సిపల్, జల వనరుల శాఖల అధికారులతో ప్రత్యేక కమిటీని ఆమె ఏర్పాటు చేశారు. ఈ నెల 23న ప్రాజెక్టు నుంచి నాలుగు టిఎంసి.ల నీళ్లను అధి కారులు విడుదల చేశారు. వీటిని పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాలు వినియో గించుకోవాల్సి ఉన్న నేపథ్యంలో వ్యవసాయ అవసరాలకు కాకుండా కేవలం తాగునీటి కోసమే వీటిని వినియోగించుకునేలా పర్యవేక్షిం చాలని కలెక్టర్ ఆదేశించారు. మోటర్ల ద్వారా వ్యవసాయ అవసరాల కోసం ఈ నీటిని ఎవ రూ దొంగిలించకుండా కాలువగట్లపై గస్తీ నిర్వహించాలన్నారు. అవసరమైన తాగునీటి ట్యాంకులు, ఇతర వనరులకు సాగర్ నీటిని మళ్లించి జిల్లాలోని ప్రజలకు తాగునీటి సమ స్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబం ధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

చర్చలు సఫలం

ఒప్పంద పత్రం అందిస్తున్న వెన్నా పోలిరెడ్డి

- పెరిగిన డిజైన్ స్లేట్
- కార్మికుల కూలి రేట్లు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పలకల పారిశ్రామికవాడలోని డిజైన్ స్లేట్ కార్మికుల కూలి రేట్ల పెం పు కోరుతూ చేపట్టిన ఆం దోళన ఫలించింది. డిజైన్ స్లేట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వ ర్యంలో ఈ పోరాటం సాగింది. డిజైన్ స్లేట్ స్టోన్ మాన్యుఫ్యాక్చర్స్ అసోసియేషన్‌తో కార్మిక సంఘం ప్రతినిధుల తో శనివారం నాటి చర్చలు ఫలించాయి. దీంతో కూలి రేట్లు పెరిగాయి.

ఈ చర్చల్లో కార్మికుల డిమాండ్లకు యజ మానులు అంగీకరించినట్లు సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం రఫి, డిజైన్స్ స్లేట్, ముజాయిక్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి పి.రూబెన్ వెల్లడించారు. గతంలో పెంచిన కూలి రేట్ల ఒప్పంద కాలం ముగియడంతో ఈ నెల 4న కార్మికుల కూలీలు పెంచాలని డిమాం డ్ నోటీసు యజమానులకు అందజేశారు. ఈ సందర్భంగా కూలీల పెంపుదల కోసం యజమానులు-కార్మికులకు మధ్య నాలుగు దఫాలుగా చర్చలు జరిగాయి. ఇంతకు ముందు జరిగిన చర్చల్లో కూలీలకు అనుకూలంగా రేట్లు లభించకపోవడంతో యజమానులలో కార్మిక సంఘంతో పాటు కార్మికులు విబేధించడం జరిగింది. దీంతో కార్మికులు ఆందోళన ఉధృతం చేశారు.

తాజా చర్చల్లో కార్మికుల డిమాండ్లకు యాజమాన్యం ఎట్టకేలకూ అంగీకరించింది. ప్రస్తుత ఒప్పందం ప్రకారం కార్మికులకు పెరి గిన రేట్ల వివరాలు ఇలా... ఆపరేటర్‌కు రూ.297 నుండి రూ.329, హెల్పర్‌కు రూ.294 నుండి రూ.326కు పెంచడం జరి గింది. చీల్పుల కార్మికులకు రూ.320 నుండి 350కు పెరిగింది. ముజాయిక్ కార్మికులకు పాత రేటు మీద 11 శాతం పెంచారు. క్యాలి బ్రేషన్ కార్మికులకు రూ.150 నుండి రూ.166కు పెంచేందుకు యజమానులు అంగీకరించారు. యజమానులు-కార్మిక సం ఘాల ప్రతినిధులతో పాటు కార్మికులు నూతన ఒప్పందం చేసుకున్నారు. ప్రస్తుత ఒప్పంద కాలపరిమితి రెండు సంవత్సరాలు అమలులో ఉంటుంది. కార్యక్రమంలో యజమానుల తర పున ప్రతినిధులుగా వెన్నా పోలిరెడ్డి, గుప్తా ప్రసాద్, వై కోటేశ్వరరావు, ఎం.వి.రామ్స్, వెంకటరెడ్డి, కార్మికుల తరపున యూనియన్ ప్రతినిధులు టి రాములు, కె.వెంకటేశ్వరరెడ్డి, టి ప్రకాష్, శేషగిరి, శ్రీను, తిరుపాలు, నాగూర్, మాబు, సుబ్బయ్య, వెంకటేశ్వర్లు, అనూష, కీర్తన, కాశమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆటవిక చర్యలు జరుగుతుంటే..
మంత్రి స్వామి ఏం చేస్తున్నారు.?

- అంబేద్కర్ జయంతిని
- అడ్డుకున్న పెత్తందారులను
- అరెస్టు చేయాలి..
- జేసీ ఆధ్వర్యంలో
- విచారణ జరపాలి..
- 26న ఒంగోలులో
- నిరసన కార్యక్రమం
- కెవిపిఎస్ రౌండ్‌టేబుల్ సమావేశంలో
- వక్తల డిమాండ్

మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురాం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సంద ర్భంగా జరుగుమల్లి మండలం, కే.బిట్రగుంట గ్రామంలో అంబేద్కరిస్టుల ఊరేగింపును అడ్డుకున్న పెత్తందారులను అరెస్టు చేయాలని, పోలీస్ అధికారుల సాక్షిగా జరిగిన ఘటనపై జాయింట్ కలెక్టర్‌తో విచారణ జరిపించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. మంత్రి నియోజకవర్గంలో ఇటువంటి ఆటవిక చర్యలు జరుగుతుంటే మంత్రి స్వామి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా జరుగుమల్లి మండలం, కె.బిట్రగుంటలో అంబేద్కర్ జయంతి ఊరేగింపును అడ్డుకున్న ఘటనపై శనివారం నాడు కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.మోజేష్ అధ్య క్షతన జరిగిన ఈ కార్యక్రమం లో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘు రామ్ మాట్లాడుతూ సింగ రాయకొండ సీఐ, జరుగు మల్లి ఎస్ఐ సమక్షంలో ఘటన జరిగి నేటికి 40 రోజులు గడుస్తున్నప్పటికీ కేసు నమోదు చేయకపోవడం విచారకరమన్నారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే కేసు నమోదు కాలేద న్నారు. తక్షణమే కలెక్టర్ గారు జోక్యం చేసు కొని ఘటనపై జాయింట్ కలెక్టర్ ద్వారా సమగ్రమైన విచారణ ▶ 2లో

మంత్రుల దృష్టికి నిధుల సమస్య

ప్రజాశక్తి-దర్శి

దర్శి నియోజకవర్గంలో నిధుల సమస్యను మంత్రులు, అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్ దృష్టికి టిడిపి దర్శి ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి తీసుకెళ్లారు. మార్టూరు మండలం ఇసుక దర్శిలో గల ఏలూరు సాంబశివరావు క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావుతో కలిసి శనివారం నిర్వహించిన సమావేశంలో దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి నియోజకవర్గంలో నిధుల సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ దర్శి నియోజకవర్గంలో పొగాకు రైతులు నష్టాలపాలవుతున్నారని అన్నారు. పండించిన పొగాకును కొనేనాథుడు లేడన్నారు. దర్శి నియోజకవర్గంలో దాదాపు 30 వేల ఎకరాల్లో పొగాకు సాగు చేశారు. బారినీ పొగాకు రూ.25,000 కొంటే గాని గిట్టుబాటు అయ్యే పరిస్థితి లేదు. పొగాకు బోర్డు కొనుగోలులో కొంత నిరాసక్తితో ఉండడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. పొగాకు చెక్కులు వేలం కేంద్రాలకు వెళ్లి వెనక్కు పంపుతున్నారు. రైతులు వెళ్లిన వెనక్కి రావడంతో బాడుగ నష్టపోతూ మానసికంగా క్రుంగిపోతున్నారు. పొదిలి, వెల్లంపల్లి, కనిగిరి కేంద్రాలలో పొగాకు సరిగా కొనక వెనక్కు వస్తున్నాయి. కొంటున్న పొగాకు కూడా రూ.20,000 మద్దతు రేటు ప్రకటించడం వల్ల రైతులు నష్టపోతున్నారు. ఇక వైట్ బర్లీ పొగాకు ప్రైవేట్ కంపెనీలు ఐటిసి జిపిఏ కంపెనీలు కొనుగోలుకు నిరాసక్తి చూపుతున్నాయి. ధర కేవలం రూ.పది వేల నుంచి రూ.15 వేల లోపు ఉండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. అదేవిధంగా సిరిపుగాకు 20 వేల వరకు కొనాల్సిఉండగా వేలం కేంద్రాలలో కొనుగోలు చేయడం లేదు. ఇలా దొనకొండ, దర్శి, కురిచేడు, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల్లో 30 వేల ఎకరాలలో పొగాకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే సంబంధిత టొబాకో అధికారులతో మాట్లాడి రైతులకు న్యాయం చేయాలని ఆమె కోరారు. లేనట్లయితే తాను రైతుల పక్షాన వేలం కేంద్రాల వద్దకు రావాలని, తనను రైతులు ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. దీనిపై వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ ప్రతి పొగాకు రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.

సమాజంలో సంఘటనలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-గిద్దలూరు

పట్టణంలోని సబ్ జైలును ప్రకాశం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌కె ఇబ్రహీం షరీఫ్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విచారణ ఖైదీల కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమాజంలో జరుగుతున్న సంఘటనల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి విషయంలో తగిన జాగ్రత్తతో మెలగాలన్నారు. ఆవేశం అనర్థదాయకమని, చట్ట వ్యతిరేక పనులు చేసినప్పుడు శిక్షార్హులు అవుతారని అన్నారు. న్యాయ సేవాధికార సంస్థల ద్వారా ఉచితంగా న్యాయవాదిని పొందవచ్చని తెలిపారు. అరెస్ట్, బెయిల్ గురించి విచారణ ఖైదీలకు అవగాహన కల్పించారు. విచారణ ఖైదీలకు అందుతున్న సదుపాయాల గురించి తెలుసుకున్నారు. వారికి అందిస్తున్న ఆహారం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ ఓంకార్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె భరత్‌చంద్ర, గిద్దలూరు సబ్ జైల్ సూపరింటెండెంట్ యు లింగారెడ్డి, న్యాయవాది కె రవిప్రకాష్‌బాబు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

విచారణ ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌కె ఇబ్రహీం షరీఫ్

'ఆత్మహత్య' మాటే వినపడకూడదు..

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ సంక్షోభం లాంటి ఇబ్బందులు వచ్చినప్పుడే రైతులను ఆదుకోవా లని అన్నారు. కంపెనీల ప్రోత్సాహంతోనే బ్లాక్ బర్లీ పొగాకును రైతులు సాగు చేశారని, చివరి ఆకు వరకు కొనేలా ప్రభుత్వం బాధ్యత వహిస్తుందన్నారు. ఆత్మహత్యలు అనే మాట వినపడ రాదని, అలాంటి ఆలోచన రైతుల్లోకి రాకూడదన్నారు. వచ్చే ఏడాది పొగాకు పంట సాగు తగ్గించేలా అధికారులు ప్రణాళిక లు పొందించుకోవాలన్నారు. ప్రాసెసింగ్ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని, మంత్రి ప్రకటించడంతో ఐటిసి 10 మిలియన్లకు మించి కొనుగోలు చేయాలని, జిపిఐ కంపెనీ 20 మిలియన్లకు పైగా కొనుగోలు చేయాలన్నారు. మిగిలిన కంపెనీలు లక్ష్యాలకు మించి పొగాకు కొనుగోలు చేపట్టాలన్నారు.

వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి రాజశేఖర్ మాట్లాడుతూ రైతుల వద్ద ఉన్న పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేయిస్తామన్నారు. కలెక్టర్ జె వెంకట మురళి మాట్లాడుతూ పొగాకు రైతులకు మేలు జరిగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మంత్రి ప్రకటించిన ధరలతో కంపెనీలు ముందుకు వచ్చి పొగాకు పంటను కొనుగోలు చేయాలన్నారు. పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ సంక్షోభంలో ఉన్న పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రెండు గ్రేడ్లతోనే పొగాకు కొనుగోలు జరగాలన్నారు. పర్యవేక్షణ సెల్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వం చేపట్టే విధి విధానాలను ఆయన వివరించారు.

బ్లాక్ బర్లీ పొగాకు సాగుతో తీవ్రంగా నష్టపోయామని, కనీస మద్దతు ధర అమలు చేయాలని ఇంకొల్లు దుద్దుకూరు రైతులు హరిబాబు, వాసు బాబు, కె వెంకట సుబ్బారావు, సూది సుబ్బారావు, మహిళా రైతు రమాదేవి, జె పంగులూరు మండలం రైతులు రావూరి రమేష్‌బాబు కోరారు. న్యాయం చేయాలంటూ మంత్రి వద్ద అభ్యర్థించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు, టుబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్, ఈడి విశ్వసేన్, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండి సురేష్, సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ, మార్కెటిం గ్ శాఖ అధికారి రమేష్‌బాబు, మార్క్ ఫెడ్ అధికారి కరుణ, ఉద్యానశాఖ ఏడి జెన్నమ్మ, 20 కంపెనీల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరతో కొనాలి..

రైతు, కౌలు రైతు సంఘం నేతలు

రైతులు పండించిన నల్లబర్లీ పొగాకు మొత్తాన్ని గిట్టుబాటు ధరతో వెంటనే కొనుగోలు చెయ్యాలని ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలురైతు సంఘం నేతలు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు వినతిపత్రం అందజేశారు. బాపట్ల జిల్లా రైతాంగం నల్లబర్లీని ప్రధాన పంటగా ఎంచుకుని పండించారు. రబీ ప్రారంభానికి ముందు పొగాకు కంపెనీల ప్రతినిధులు రైతులతో సమావేశమై పొగాకు కొంటామని చెప్పారు. గతేడాది పొగాకు లాభసాటిగా ఉండడంతో రైతులు కంపెనీల ప్రోత్సాహంతో కౌలు ఎక్కువ పెట్టి నల్లబర్లీ పొగాకు సాగు చేసినట్లు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 90 శాతం పంట కౌలు రైతులే పండించారని, పంట చేతికి వచ్చాక కంపెనీల వారు మొహం చాటేయడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. అకాల వర్షాలకు పొగాకు మండెలు దెబ్బతింటున్నాయన్నారు. తక్షణమే నల్లబర్లీ పొగాకు మొత్తాన్ని మద్దతు ధరతో కొనాలని రైతు, కౌలు రైతు సంఘం నేతలు సిహెచ్ గంగయ్య, బత్తుల హనుమంతరావు, కందిమళ్ళ రామకోటేశ్వరరావు, తల్లపనేని రామారావు, కె రాజమోహన్ విజ్ఞప్తి చేశారు.

జూన్ 21 వరకు 'యోగా'

ప్రజాశక్తి-మార్టూరు

పదకొండవ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యోగా కార్యక్రమాలు వచ్చే నెల 21వ తేదీ వరకు అన్ని వార్డు సచివాలయాల పరిధిలో ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణరావు శనివారం తెలిపారు. పట్టణంలోని నాయుడు బజారును 'యోగా రోడ్డు'గా నిర్ణయించినట్లు చెప్పారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు యోగా రోడ్డులో యోగా కార్యక్రమాలు ఉంటాయన్నారు. పట్టణంలోని ప్రజలు యోగాలో పాల్గొని ఆరోగ్యం మెరుగు పర్చుకోవాలన్నారు.

పంట అమ్ముడుపోక..అప్పులు తీర్చలేక..

(మొదటిపేజీ తరువాయి)

కనిపించింది. తన కుమారుడు విగతజీవిగా పడి ఉండటంతో హరిబాబు కన్నీరు మున్నీరుగా విలపించాడు. వ్యవసాయంలో వచ్చిన నష్టాల వల్లే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని శ్రీనాథ్ భార్య వందన విలపించింది. శ్రీనాథ్‌కు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, సొసైటీలలో 15 లక్షల రూపాయలు, ప్రైవేట్ వ్యక్తుల దగ్గర తెచ్చిన అప్పు మరో రూ.15 లక్షలు వరకు ఉందని చెబుతున్నారు. శ్రీనాథ్‌కు భార్య వందన, 9 సంవత్సరాల వయసున్న కుమార్తె రిత్విక్ చౌదరి, ఏడు సంవత్సరాల వయసున్న కుమారుడు కార్తికేయ ఉన్నారు.

రైతు సంఘం నాయకుల పరామర్శ

కౌలు రైతు తలపనేని శ్రీనాథ్ మృతదేహాన్ని రైతుసంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, సీనియర్ నాయకులు కందిమల్ల రామకోటేశ్వరరావు శనివారం సాయంత్రం సందర్శించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ పొగాకు కంపెనీలు, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే శ్రీనాథ్ ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మార్క్‌ఫెడ్ ద్వారా, లేదా కంపెనీల ద్వారా నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయించాలని డిమాండ్ చేశారు.

మంత్రి స్వామి ఏం చేస్తున్నారు.?

(మొదటిపేజీ తరువాయి)

జరిపించాలన్నారు. దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అంబేద్కర్ ను స్మరిస్తూ గౌర విస్తుంటే రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డాక్టర్ స్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న కొండపి నియోజకవర్గం లో, ఆయన నివాసానికి కూత వేటు దూరంలో పెత్తందారులు దుశ్చర్యలకు పాల్పడటం అత్యంత దారుణమన్నారు. మంత్రి నియోజకవర్గంలో ఇటువంటి ఆటవిక చర్యలు జరుగుతుంటే మంత్రి స్వామి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా మాల ఉద్యోగుల సంఘం జేఏసీ చైర్మన్ కొప్పోలు ఏడుకొండలరావు, ఐఎల్‌పి నాయకులు దాసరి సుందరం మాట్లాడుతూ ఎక్కడ దళితులకు అన్యాయం జరిగితే అక్కడ తాము అండగా ఉంటామన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ఇలాకాలో ఇటువంటి ఘటనలు చూస్తుంటే దళితుల పట్ల ఈ ప్రభుత్వానికి ఎటువంటి చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ చట్టాలు ఉన్నవాళ్లకు చుట్టాలుగా మారుతాయన్న విషయం బిట్రగుంట విషయంలో మరోసారి రుజువయిందని అన్నారు. ఈ అంశం పై సోమవారం నాడు నిరసన చేపట్టాలని తీర్మానించారు. సోమవారం నాడు ఒంగోలులో అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి ప్రకాశం భవనం వద్దకు ప్రదర్శన చేపట్టి, కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయాలని, ఈ కార్యక్రమానికి జిల్లాలోని దళిత ప్రజా సంఘాలు, అభ్యుదయవాదులు, ప్రజాతంత్ర వాదులు కలిసి రావాలని వారు కోరారు. కార్యక్రమంలో వివిధ దళిత ప్రజా సంఘాల నాయకులు దారా అంజయ్య, మేడిది రవి, బంటుపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రజాశక్తి-సిఎస్ పురం

ఆరోగ్య సమస్యలపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఫిజియోథెరపీ వైద్యులు ఆర్ వెంకటరమణ సూచించారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి ఫిజియోథెరపీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. ఏవైనా ఒళ్ళు నొప్పులు వచ్చినప్పుడు పెయిన్ కిల్లర్స్ టాబ్లెట్లు వాడకూడదు అన్నారు. ముఖ్యంగా ప్రతి మనిషి ఉదయం లేవగానే వాకింగ్ చేయడం చాలా అవసరం అని చెప్పారు. ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించకపోయినట్లయితే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఓపిఆర్‌డి వెంకటరమణయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై సూచనలు ఇస్తున్న వైద్యులు ఆర్ వెంకటరమణ

పాస్‌పోర్టు పోయినది

కాజా శ్రీనివాసరావు S/o జగన్నాధరావు, వయస్సు 57 సంవత్సరాలు, డోర్ నెం.4-5-17, 2వ లైను, అగ్రహారం, శివాలయంవీధి, బాపట్ల టౌన్, బాపట్లజిల్లా, ఆంధ్ర ప్రదేశ్ నివాసి అయిన నేను పాస్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, హైదరాబాదు వారు జారీ చేసిన నంబర్ B2579557 కలిగిన భారతీయ పాస్‌పోర్ట్ కలిగి ఉన్నాను. నేను నా కుటుంబానికి సంబంధించిన సామానులు గుంటూరు నుండి బాపట్ల తరలిస్తుండగా ది.21-08-2010 వరకు చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టు పోయినది. దొరికిన వారు పై అడ్రస్ కు తెలియజేయగలరు.

ADDANKI MUNICIPALITY

E - Procurement Short Tender Notice

S. No	Tender Notice No	Name of the work	Estimate Amount (Rs. In Lakshs)
1.	47/NIT/2025-26 to 50/NIT/2025-26	Addanki Municipality- Laying of HDPE Pipe Line, Engaging the Workers for Night Sweeping and Construction of Sluice Valve	26.50

Download Start Date &Time : 24/05/2025 5.00 PM
Download End Date &Time : 30/05/2025 5.00 PM
Receipts Of Bids end Date &Time : 31/05/2025 4.00 PM
PQ Stage Opening Date &Time : 31/05/2025 4.01 PM

For further details visit " WWW. eprocurement. gov. in
No :7331143660

Commissioner
Addanki municipality

విద్యార్థులకు ప్రవేశ పత్రాలను అందచేస్తున్న హెచ్‌ఎం మౌలాలి

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసలు

ప్రజాశక్తి-తర్లుపాడు

మండలంలోని లింగారెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాలలోని ముగ్గురు విద్యార్థులు గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించారు. పాఠశాలలోని విద్యార్థులు వెలుగొండ గురుకుల పాఠశాలలో మందా ఆదాము, రాచర్ల బాలిక గురుకుల పాఠశాలలో మందా అంజలి, అర్ధవీడు గురుకుల పాఠశాలలో మందా షాలెంరాజు ప్రతిభ కనబరిచి సీట్లు సాధించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు షేక్ మౌలాలి విద్యార్థులకు ప్రశంసలు తెలియజేసి, స్వీట్లు పంపిణీ చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఈ విద్యార్థులకు ఐదవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మంచి సౌకర్యాలతో, నాణ్యమైన విద్యను గురుకులాల్లో పొందవచ్చునన్నారు. బంగారు బాల్యానికి గురుకుల పాఠశాలలు ఒక వరమని విద్యార్థులు బాగా చదువుకొని, ఉన్నత స్థాయికి ఎదగాలని మౌలాలి తెలిపారు.

గాలెయ్య వర్ధంతి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

కామ్రేడ్ నక్క గాలెయ్య ఆరో వర్ధంతి వేడుకలు సొంత గ్రామం గంగపాలెంలో శనివారం జరిగాయి. అక్కడి స్తూపం వద్ద నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ నక్క గాలెయ్య యర్రగొండపాలెం ఏరియాలో జరిగిన పోరాటాలలో పాల్గొని సేవలను అందించారు. ఆయన ఆశయాలను కొనసాగించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కెవి కృష్ణగౌడ్, టిసిహెచ్ చెన్నయ్య, బాణాల రామయ్య, నక్క తిరుపతయ్య, మొగిలి వెంకటేశ్వర్లు, మొగిలి చిన్న వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భూములను పరిశీలించిన ఆర్డీవో

ప్రజాశక్తి-దొనకొండ

దొనకొండ మండలంలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు నిమిత్తం ఎంపిక చేసిన ప్రభుత్వ భూములను కనిగిరి ఇన్‌చార్జి ఆర్డీవో శివరామిరెడ్డి పరిశీలించారు. సోలార్ ప్రాజెక్టుకు ఎంపిక చేసిన భూముల పరిస్థితిపై అవగాహన నిమిత్తం శనివారం ఆయన దొనకొండ విచ్చేశారు. దొనకొండ మండల ఇన్‌చార్జి తహశీల్దార్ శ్రావణ్‌కుమార్ రుద్రసముద్రం, రాగమక్కపల్లి, మల్లంపేట గ్రామాల్లోని ప్రభుత్వ భూములను చూపించి ఆ భూములకు చెందిన మౌళిక సౌకర్యాలు, హద్దులు తదితర పూర్తి సమాచారాన్ని మ్యాపుల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో మాచర్ల, సర్వేయర్లు మస్తాన్, వెంకటరావు తదితరులు ఉన్నారు.

వేదికను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి తహశీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ ఏవీ రవిశంకర్ శనివారం తెలియజేశారు. ఈ పరిష్కార వేదికలో అన్ని శాఖల అధికారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ఫిర్యాదుల రూపంలో ఈ వేదిక ద్వారా అందించి పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

టిడిపి మహానాడును జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పుల్లలచెరువు

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు దివంగత నందమూరి తారక రామారావు జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 27, 28, 29 తేదీలలో కడపలో జరుగనున్న మహానాడును జయప్రదం చేయాలని టిడిపి మండల కన్వీనర్ పయ్యావుల ప్రసాదు విజ్ఞప్తి చేశారు. ఈ పండుగకు పుల్లలచెరువు మండలం నుంచి ఎన్‌టి రామారావు అభిమానులు, చంద్రబాబు అభిమానులు, బాలకృష్ణ, లోకేష్, జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణ్ రామ్ అభిమానులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో కడప మహానాడుకు తరలిరావాలని ఆయన కోరారు.

యుటిఎఫ్ కార్యాలయంలో బదిలీల నమోదు ప్రక్రియ

ప్రజాశక్తి-కనిగిరి

ఉపాధ్యాయుల బదిలీలకు సంభందించి ఆన్లైన్ దరఖాస్తులు యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి టి రమణారెడ్డి, షేక్ ఖాజా రహంతుల్లా, డి రాము, పోతులురయ్య ఆధ్వర్యంలో కనిగిరి యుటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో నమోదు ప్రక్రియను చేపట్టారు. ఈ కార్యక్రమంలో కనిగిరి, వెలిగండ్ల, హనుమంతునిపాడు, పెద చెర్లోపల్లి మండలాల అధ్యక్ష కార్యదర్శులు హాజరై కార్యాలయంలోని 5 కంప్యూటర్లపై నరసింహం, మల్లిఖార్జున, యేసు బాబు, రమేష్, మాల్యాద్రి, సుబ్బారెడ్డి, జిలాని, బ్రహ్మయ్య నమోదు చేస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్ లకు 24 వరకు గడువుగా, సెకండరీ గ్రేడ్ టీచర్ కు 27 వరకు .ప్రధానోపాధ్యాయులు ఆప్షన్ పెట్టుకొనుటకు 28 వరకు, స్కూల్ అసిస్టెంట్ లకు జూన్ 1,2 తేదీలలో,సెకండరీ గ్రేడ్ లకు 7 నుండి మన్యువల్ కౌన్సెలింగ్ ఒంగోలులో జరుగుతుందని వారు పేర్కొన్నారు.

నమోదు ప్రక్రియను చేపట్టిన యుటిఎఫ్ నాయకులు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి -కనిగిరి

కనిగిరి పట్టణంలోని అమరావతి గ్రౌండ్లో శనివారం సాయంత్రం కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన 51 మంది లబ్దిదారులకు 50,14,225/-విలువ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులును రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పంపిణీ చేశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందిన పేదవారికి కొంత ఊరట ఇచ్చేందుకు సీఎంఆర్‌ఎఫ్ ఉపయోగపడుతుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, లబ్ధిదారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి గొట్టిపాటి

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సంతనూతలపాడు హైస్కూల్ ప్రాంగణంలో ఈ నెల 25వ తేదీ ఆదివారం ఉదయం సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒంగోలు సర్వ నేత్రాలయ సూపర్ స్పెషాలిటీ రెటీనా కంటి హాస్పిటల్ వారి పర్యవేక్షణలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ శనగల వెంకటరమణ, ఫౌండర్ ఎన్నారై పాతూరి సంపత్, వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి, కమిటీ సభ్యులు శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి అనంతరం మందులను పంపిణీ చేయనున్నట్లు వారు తెలిపారు. సర్వ నేత్రాలయ రెటీనా కంటి హాస్పిటల్ వైద్యులు పి మానస తదితర సిబ్బంది ఈ మెగా వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు సేవలు అందించనున్నట్టు వారు తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చే ప్రజలు వారి ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు కాపీలను తెచ్చుకోవాలని వారు తెలిపారు. అవసరమైన వారికి తదుపరి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ మెగా కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని వారు కోరారు.

మహిళా అధ్యక్షురాలిగా కృష్ణవేణి

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం నియోజకవర్గ కాపునాడు మహిళా అధ్యక్షురాలిగా సిద్ధం కృష్ణవేణి నియమితుల య్యారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోగుల మల్లికార్జున రావు, ప్రధాన కార్యదర్శి దాసరి పిచ్చయ్య ఈ మేరకు నియామకపు ఉత్తర్వులు శనివారం జారీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ కాపుల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తామని తెలిపారు. నియోజకవర్గం లోని మండలాలకు కాపునాడు సంఘం కమిటీలను నియమిస్తామన్నారు. త్వరలో నియోజకవర్గంలోని కాపు మహిళలను ఏకం చేస్తామన్నారు. ఒక వ్యవస్థగా ఏర్పాటు చేసి అన్ని రంగాల్లో ముందుకు తెస్తామని కృష్ణవేణి తెలియజేశారు. కాపు మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు.

మాట్లాడుతున్న కాపునాడు మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి

గంగమ్మ తల్లి ఆలయంలో 'దద్దాల' పూజలు

ప్రజాశక్తి-సిఎస్‌పురం

మండల కేంద్రమైన సిఎస్‌పురంలోని డిజిపేట రోడ్డులో వెలసి ఉన్న గంగమ్మ తల్లి తిరునాళ్ల అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కనిగిరి వైసీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్ గంగమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు నారాయణ యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి మేకల శ్రీనివాస్‌యాదవ్, నన్నసాని గుంటయ్య, పులిమి ఆదినారాయణ, మన్నేపల్లి పెద్దన్న, ఇండ్ల బాలయ్య, ఆలా లక్ష్మయ్య, పలువురు గ్రామ కమిటీ పెద్దలు గంగమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పూజలు నిర్వహిస్తున్న దద్దాల నారాయణ యాదవ్

నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి

నాగయ్యకు నివాళులర్పించిన మాజీ మంత్రి

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణానికి చెందిన పాపబత్తిని నాగయ్య హార్ట్ స్ట్రోక్‌తో మరణించగా ఆయన పార్థివ దేహాన్ని శనివారం మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. చిన్ననాటి మిత్రుడు నాగయ్య చదువుకునే రోజుల నుంచి ఆ తర్వాత రాజకీయాలలో వెన్నంటే ఉండి తనకు సహకారం అందించిన మంచి వ్యక్తిని కోల్పోవడం బాధాకరమని కాశిరెడ్డి అన్నారు. అనంతరం చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని బాధపడ్డారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.

తనిఖీలో లీగల్ సెల్ అథారిటీ సెక్రటరీ షరీఫ్

సబ్‌జైలు తనిఖీ

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం సబ్ జైలును జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ షేక్ ఇబ్రహీంషరీఫ్ శనివారం తనిఖీ చేశారు. సబ్ జైలులోని వంటశాల, స్టోర్ రూమ్, ఖైదీలు ఉండే గదులను పరిశీలించారు. ఖైదీల యొక్క స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. న్యాయ సహాయం అవసరమైన వారు మండల లీగల్ సర్వీస్ అథారిటీని సంప్రదించాలన్నారు. ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని ఖైదీలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఆకుల ఉషశ్రీ, మండల లీగల్ సర్వీస్ అథారిటీ సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ, పిఎల్‌వి షేక్ బాషా, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టమోటాలు ఏరుకుంటున్న జనం

టమోటా లారీ బోల్తా...

డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి-పెద్దారవీడు

ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి టమోటా లారీ బోల్తా పడిన సంఘటనలో డ్రైవర్, క్లీనర్‌లు స్వల్ప గాయాలకు గురయ్యారు. ఈ సంఘటన పెద్దారవీడు మండలంలోని దేవరాజుగట్టు సమీపంలో జాతీయ రహదారిపై శనివారం తెల్లవారు జామున 5 గంటల ప్రాంతంలో జరిగింది. మదనపల్లి నుంచి టమోటా లోడుతో ఒడిసాలోని విలాస్‌పురికి లారీ బయలుదేరింది. దేవరాజుగట్టు ప్రాంతంలో ఎదురుగా లారీ మీదకు రావడంతో దాన్ని తప్పించబోయే క్రమంలో టమోటా లారీ అదుపు తప్పి బోల్తా పడటంతో ఈ ప్రమాదం జరిగింది. టమోటా బాక్సులన్నీ నేలపాలు కావడం సమీప గ్రామ ప్రజలు టమోటాలు ఎత్తుకుపోయారు. ప్రమాద స్థలాన్ని పెద్దారవీడు ఎస్ఐ పి అనికుమార్ పరిశీలించారు.

నిర్మాణ పనులు పరిశీలిస్తున్న నరేంద్ర వర్మ

తరగతి గదుల నిర్మాణం పూర్తి చేయాలి

ప్రజాశక్తి-బాపట్ల

పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌లో నూతన తరగతి గదుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని బాపట్ల శాసనసభ్యులు నరేంద్ర వర్మ అధికారులను ఆదేశించారు. రూ1 కోటి 48 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నిర్మాణ పనులను శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఈ తరగతి గదుల నిర్మాణాలను పూర్తిగా గాలికి వదిలేసిందన్నారు. ఐదేళ్ల కాలంలో కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్ డైరెక్టర్ నాగిరెడ్డి, మున్సిపల్ హై స్కూల్ హెచ్.ఎం. రాజశ్రీ పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలుకు చెందిన టీడీపీ కార్యకర్త షేక్ అన్వర్ ఆలీ ఇటీవల ప్రమాదావశాత్తు మృతి చెందగా రూ.5 లక్షల బీమా చెక్కును కుటుంబసభ్యులకు శనివారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అందజేశారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి పార్టీ పరంగా జీవిత బీమా లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, నాయకులు బేగ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులతో ఎమ్మెల్యే కొండయ్య

సీఎం సహాయనిధి పేదలకు వరం

ప్రజాశక్తి-చీరాల

నిరుపేదలకు సీఎం సహాయనిధి వరం అని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో 38 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలలో 54 లక్షలు సీఎం సహాయ నిధి నుంచి చీరాల నియోజకవర్గ ప్రజలకు అందించిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలలో కూడా కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు.

మెగా డీఎస్సీ నిర్వహణపై సమీక్ష

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

జూన్ ఆరు నుంచి నిర్వహించే మెగా డిఎస్సీపై జిల్లా విద్యా శాఖాధికారులతో కలెక్టర్ ఎ.తమీమీమ్ అన్సారియా శనివారం రాత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించనున్న ఈ పరీక్షలకు సంబంధించి ఒంగోలు సమీపం లోని పేస్ ఇంజనీరింగ్ కాలేజీ, క్విస్ ఇంజనీరింగ్ కాలేజీ, రైస్ కృష్ణ సాయి ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ, రైస్ కృష్ణసాయి గాంధీ ఇంజనీరింగ్ కాలేజీలలో నిర్వహించనున్నట్లు డిఈఓ ఎ.కిరణ్ కుమార్ తెలిపారు. గత నెలలోనే ఆయా కాలేజీల యాజమాన్యంతో చర్చించినట్లు ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. పరీక్షలు నిర్వహించడంలో అంతరాయాలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు.

ఎండియు వాహనాలను కొనసాగించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మజుందార్

ప్రజాశక్తి-అద్దంకి

ఇంటింటికీ ఎండియు వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్న ఆపరేటర్లను, అసిస్టెంట్లను కొనసాగించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ డిమాండ్ చేశారు. శనివారం అద్దంకి తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం ప్రభుత్వం ఎటువంటి చర్చలు జరపకుండా ఏకపక్షంగా ఎండియు వాహనాలలో పనిచేస్తున్న ఆపరేటర్లు, అసిస్టెంట్లను తొలగించటం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో 18,520 మంది ఆపరేటర్లు వీధుల పాలయ్యారని అన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని వీరందరినీ కొనసాగించాలని, రేషన్‌లో ఎక్కడైనా అక్రమాలు జరిగితే వాటిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేయవలసి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, ఐలు నాయకులు డి.గంగాధర్, ఎస్ కే కరీమ్, ఎండియు వాహనాల సిబ్బంది జి.రాజశేఖర్, ఎం.జాన్సన్, ఎం.హరీష్, వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మద్యపాన వ్యసనం నుంచి బయటపడాలి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా శనివారం బాపట్ల పట్టణంలోని గాదె వెంకటరెడ్డి నగర్‌లో కేర్ ఆధ్వర్యంలో మద్యపాన వ్యసనం వల్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె విజయ ఈ కార్యక్రమంలో పాల్గొని మద్యపాన వ్యసనం వల్ల దుష్ఫలితాలు దానివలన సమాజంలో ఎదురయ్యే సమస్యలు వ్యసన విముక్తికి గల అవకాశాలను గురించి తెలియజేశారు. డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మద్యపాన వ్యసనం వల్ల వ్యక్తులు కుటుంబం ఎదుర్కొనే ఆర్థిక, సామాజిక ఇబ్బందులను తెలియజేసి దీని నుంచి విముక్తి కోసం వారికి అందించే మద్దతు గురించి వివరించారు. డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ ఎన్ మోసెస్ కుమార్ మాట్లాడుతూ మద్యపానం వలన కలిగే ఆరోగ్య సమస్యలు, ఇబ్బందులు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ అధికార,సిబ్బంది ఎమ్ గోపీనాథ్, వై శ్రీనివాసరావు,ఐవి బ్రహ్మం,జి అజంతా రాణి,బి ఇందిర,పి శ్రీమన్నారాయణ, డి ప్రభుదాస్ , ఎ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనా పత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

మూగజీవాలను సంరక్షించాలి

పారిశ్రామిక వేత్త మండవ మురళీ కృష్ణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మూగజీవాలను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పారిశ్రామిక వేత్త మండవ మురళీ కృష్ణ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం సేవ్ ది యానిమల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒంగోలు రంగారావు చెరువు కట్ట గాంధీ విగ్రహం వద్ద మూగ జీవాల సంరక్షణ అవగాహన సదస్సు జరిగింది. సంస్థ వ్యవస్థాపకులు టి దివ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మురళీకష్ణ మాట్లాడుతూ వీధి కుక్కలు, ఇతర మూగజీవాలను సేవ్ ది యానిమల్ ఫౌండేషన్ ఒంగోలు నగరంలో సంరక్షిస్తుందని, ఆ సంస్థకి ఆర్థికంగా అండగా నిలవాలని తెలిపారు. డాక్టర్ శాంతి మాట్లాడుతూ మూగజీవాలకు ఆహారం, నీరు అందించాలని ప్రమాదం జరిగిన సందర్భంలో వ్యాధులు పాలైనప్పుడు వాటి ఆలనా పాలన చూడాలని జంతువులకు ప్రత్యేకంగా దహన సంస్కారాలకి స్మశానం స్థలం ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్పొరేటర్ మలగా రమేష్ మాట్లాడుతూ జంతు సంరక్షణకు సేవ్ ది యానిమల్ ఫౌండేషన్ చేస్తున్న సేవలకు అభినందనలు తెలిపారు తన వంతు ఆర్థిక సహకారం అందిస్తానని తెలిపారు. మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ వీధి కుక్కలకు ఆహారం వైద్య ఖర్చులకు జంతు ప్రేమికులు సేవ్ ది యానిమల్ ఫౌండేషన్కు ఆర్థికంగా సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోసూరి శ్రీదేవి, ఒంగోలు మురళీకష్ణ డాక్టర్ సిహెచ్ సుధాకర్ బాబు, సుధీర్ బాబు, శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మండవ మురళీ కృష్ణ

పర్యాటకుల భద్రతకు పటిష్ట చర్యలు

ఎస్పీ తుషార్ డూడి

సముద్రతీర ప్రాంతాలలో డ్రోన్‌లతో నిఘా

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

యాత్రికుల రక్షణ, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సముద్రతీర ప్రాంతాలలో నిఘా కోసం డ్రోన్‌లను వినియోగిస్తున్నామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఎస్పీ ఆదేశాలతో పోలీస్ అధికారులు శనివారం జిల్లాలోని సూర్యలంక, రామాపురం బీచ్‌లలో, వాడరేవు సముద్రతీర ప్రాంతాలలో డ్రోన్‌లను ఎగురవేసి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన సూర్యలంక, వాడరేవు, రామాపురం బీచ్ లలో ఆహ్లాదకరంగా గడిపేందుకు చుట్టుపక్క ప్రాంతాల నుండే కాక ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి యాత్రికులు వస్తుంటారన్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు కనుక యాత్రికులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందన్నారు. దానికి అనుగుణంగా సముద్ర తీర ప్రాంతాల్లో పటిష్టమైన భద్రత చర్యలు తీసుకుంటున్నామన్నారు. యాత్రికుల రక్షణ, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అలాగే అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టే ఉద్దేశంతో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ డ్రోన్‌లతో నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సముద్రతీర పరిసర ప్రాంతాలలో అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడిచేసేందుకు డ్రోన్ లను వినియోగిస్తున్నామని తెలిపారు. పోలీస్ శాఖ చేసే సూచనలు యాత్రికుల రక్షణకోసమేనని గ్రహించి పోలీస్ శాఖకు సహకరించాలని తెలిపారు.

సముద్ర తీరంలో డ్రోన్‌లతో పోలీసుల నిఘా

స్వాధీనం చేసుకున్న లారీ

గ్రావెల్ తరలిస్తున్న వాహనాలు పట్టివేత

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం శానంపూడి నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను శనివారం పోలీసులు పట్టుకున్నారు. శానంపూడి నుంచి నెల్లూరు జిల్లాలోని కందుకూరు ప్రాంతానికి అధికంగా గ్రావెల్ తరలిస్తున్నారు. ఉలవపాడు గ్రామానికి చెందిన వేణుగోపాల స్వామి దేవస్థానానికి సంబంధించిన భూముల్లోనూ అనుమతులు లేకుండా అక్రమ గ్రావెల్ తరలిస్తున్నారు. దీనిపై జిల్లా అధికారులతో పాటు శింగరాయకొండ మండల అధికారులు దృష్టి పెట్టడంతో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి శనివారం టిప్పరును పోలీసులు స్వాధీనం చేసుకొని శింగరాయకొండ పోలీస్ స్టేషనుకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శిక్షణలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది

'యోగాంధ్ర'పై శిక్షణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

'యోగాంధ్ర'పై శిక్షణా కార్యక్రమం స్థానిక కేంద్రీయ విద్యాలయలో శనివారం నిర్వహించారు. ఈ కార్య్రమంలో యోగాపై గురువులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఒంగోలు అర్బన్ తహశీల్దార్ మధుసూదనరావు, రూరల్ తహశీల్దార్ నాయబ్‌రసూల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పనబాక లక్ష్మికి జ్ఞాపిక అందజేస్తున్న ఈవో

చందోలు బండ్లమ్మ సన్నిధిలో కేంద్ర మాజీ మంత్రి పనబాక

ప్రజాశక్తి-బాపట్ల

ప్రసిద్ధిగాంచిన చందోలు బండ్లమ్మ అమ్మవారి ఆలయాన్ని టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి శనివారం సందర్శించారు. ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పనబాక మాట్లాడుతూ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తమ వంతు కృషి చేస్తానన్నారు. ఆలయ అభివృద్ధికి సంబంధించిన అంశాన్ని టీటీడీ పాలకమండలిలో ప్రస్తావిస్తానని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఈవో ఘంటసాల నరసింహమూర్తి, పట్టణ టిడిపి అధ్యక్షుడు ఎండి అఫ్జల్, పట్టణ పార్టీ అధ్యక్షుడు గోలపల శ్రీనివాసరావు, భవనం బసిరెడ్డి, కలకోట చక్రధర రెడ్డి, మద్దాల డేవిడ్, ఖాజీ పాలెం మాజీ సర్పంచ్ రామచంద్రరాజు పాల్గొన్నారు.

పోష్ చట్టంపై అవగాహన పెంచుకోవాలి

జూనియర్ సివిల్ జడ్జి బి రూపశ్రీ

ప్రజాశక్తి-కనిగిరి

హైకోర్టు ఆదేశాల మేరకు కనిగిరి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కనిగిరి కోర్టు హాలులో పోష్ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులు (నివారణ, నిషేధం మరియు పరిహారం) చట్టం, 2013 (పోష్ చట్టం) పై కనిగిరి న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి బి రూపశ్రీ న్యాయవాదులకు, పారా లీగల్ వాలంటీర్లకు అవగాహన కలిగించారు. ఈ చట్టం గురించి అవగాహన కల్పించడం ద్వారా, పని ప్రదేశంలో మహిళలకు సురక్షితమైన, అనుకూలమైన వాతావరణం కల్పించవచ్చునని, లైంగిక వేధింపులను నివారించవచ్చునని అన్నారు. పోష్ చట్టం పని ప్రదేశంలో లైంగిక వేధింపులను నివారించడానికి, నిషేధించడానికి మరియు ఫిర్యాదులను పరిష్కరించడానికి రూపొందించారని తెలిపారు. ఈ చట్టం అన్ని రకాల పని ప్రదేశాలకు వర్తిస్తుందని అన్నారు. ప్రతి సంస్థలోనూ, లైంగిక వేధింపుల ఫిర్యాదులను విచారించడానికి, పరిష్కరించడానికి ఒక అంతర్గత కమిటీని ఏర్పాటు చేయాలని తెలిపారు. పోష్ చట్టం ప్రకారం ఏదైనా నిబంధనను ఉల్లంఘించినా లేదా ఉల్లంఘించడానికి ప్రయత్నించినా, గరిష్టంగా రూ.50,000 జరిమానా విధిస్తారని తెలిపారు. పోష్ చట్టాన్ని పాటించకుండా యజమాని దోషిగా తేలితే మొదటిసారి విధించిన శిక్షకు రెండు రెట్లు విధించడంతో పాటు వారి వ్యాపార లైసెన్స్ కూడా రద్దు చేస్తారని తెలిపారు. ఈ చట్టం గురించి న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు విస్తృతంగా ప్రజలకు అవగాహన కలిగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, వారి గుమస్తాలు, పారా లీగల్ వాలంటీర్లు, న్యాయ సేవాధికార సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి బి రూపశ్రీ

దర్శి డివిజన్‌కు రూ.1.08 కోట్ల నిధులు విడుదల

ప్రజాశక్తి-దర్శి

నాగార్జునసాగర్ కుడి కాలువ ఆయకట్టు పరిధిలో దర్శి డివిజన్ పరిధిలో రూ.1.08 కోట్ల నిధులు ప్రభుత్వం నుంచి మంజూరయ్యాయని దర్శి ఎన్ఎస్‌పి ఇఇ మాధవం రామకృష్ణ తెలిపారు. శనివారం స్థానిక ఎన్ఎస్‌పి ఇఇ కార్యాలయంలో అధికారులు ఆయకట్టు పరిధిలోని డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఇ మాట్లాడుతూ దర్శి ఆయకట్టు పరిధిలో నియోజకవర్గ స్థాయిలో రూ.33.5 లక్షల నిధులు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. అదేవిధంగా త్రిపురాంతకం పరిధిలో ఎర్రగొండపాలెం నియోజకవర్గానికి రూ.75 లక్షల నిధులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఈ పనులు రూ.పది లక్షల లోపు అయితే నామినేషన్ మీదనే ఇవ్వొచ్చని ఆయన తెలిపారు. ఆగస్టు చివరినాటికి ఈ పనులు పూర్తి చేయాలని అధికారులను, డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్‌లను ఆయన కోరారు. అదేవిధంగా సాగర్ ఆయకట్టు పరిధిలో తాగునీటి అవసరాల దృష్ట్యా సాగర్ నుంచి 5,500 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారని, ఆదివారం 10 గంటలకు త్రిపురాంతకం దగ్గరకు మన జిల్లాకు 85/3 మైలు వద్దకు కెనాల్‌కు నీరు వస్తుందని తెలిపారు. ప్రస్తుతం ఒక్క వాగులో 2,150 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నీటిని తాగునీటి అవసరాల కోసమే మాత్రమే వాడుకోవాలని ఆయన తెలిపారు. ప్రకాశం, గుంటూరు, బాపట్ల జిల్లాలకు కలిపి 4.5 టీఎంసీల నీరు విడుదల అవుతున్నట్లు ఆయన తెలిపారు. మన జిల్లాకే రెండు టీఎంసీల నీరు కావాలని కోరినట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇలు విజయలక్ష్మి పూర్ణచందు తోపాటు డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ చలమయ్య, కోటేశ్వరరావు, సందాని సుబ్బారావు, శ్రీనివాసరావుతో పాటు ఏఈలు శ్రీకాంత్ శివనారాయణ, భరత్, సాంబశివరావు, రవీంద్రారెడ్డి విజయరత్నం, ప్రసాదు పాల్గొన్నారు.

సాగరు నీటి విడుదలపై ఆయకట్టు పరిధిలో పనులపై సమీక్ష నిర్వహిస్తున్న ఎన్ఎస్‌పి ఇఇ రామకృష్ణ

వాసవీ అకాడమీ విద్యార్థుల విజయభేరి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఏపి రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ (ఏపిఆర్‌జేసీ) ప్రవేశ పరీక్షల్లో యర్రగొండపాలెం పట్టణానికి చెందిన వాసవీ అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. గత నెల 25న నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో సయ్యద్ మహమ్మద్ షమీర్, షేక్ ఇస్మాయిల్ అనే ఇరువురు విద్యార్థులు సత్తా చాటారు. మొదటి కౌన్సెలింగ్‌లోనే సీట్లు క్రమంలో ఈ నెల 26వ అర్హత పొందారు. ఈ క్రమంలో ఈ నెల 26వ తేదీ గుంటూరులోని పరీక్షా భవన్‌కు హాజరుకావాలని సమాచారం అందుకున్నారు. ఈ సందర్భంగా వాసవీ అకాడమీ డైరెక్టర్ పి బాలవీరయ్య మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన ఫలితాలు వారి కృషి, విద్యా సంస్థ అందించిన నాణ్యమైన శిక్షణకు చక్కటి ఉదాహరణ అన్నారు. ఈ విజయాన్ని మరింత ప్రోత్సాహంగా తీసుకొని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. పట్టుదల, కృషి, లక్ష్య సాధన, నిబద్ధతతో ముందుకు సాగితే మంచి ఫలితాలు సాధించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సయ్యద్ మహమ్మద్ షమీర్

షేక్ ఇస్మాయిల్

బ్లడ్ బ్యాంకు లేక ఇక్కట్లు

వైపాలెం ఏరియా ఆసుపత్రి బ్లడ్ స్టోరేజ్ సెంటర్‌కే పరిమితం • రక్తం కావాలంటే వినుకొండ, నరసరావుపేటలకు పరుగెత్తాల్సిందే!

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని వంద పడకల ఏరియా ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంకు సదుపాయం అందని ద్రాక్షగా మారింది. శస్త్రచికిత్సలు, కాన్పులు, రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు చికిత్స చేసే సమయంలో రక్తం అవసరం ఎంతో ఉంటుంది. ఇక్కడ బ్లడ్ బ్యాంక్ లేకపోవడంతో ప్రథమ చికిత్స చేసి ఒంగోలు, గుంటూరుకు తరలించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. స్థానిక ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేయమనే డిమాండ్ గత దశాబ్ద కాలంగా ఉన్నప్పటికీ వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

ఒంగోలు, నరసరావుపేట నుంచి..

యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం తదితర మండలాల నుంచి యర్రగొండపాలెం ఏరియా ఆసుపత్రికి ప్రతిరోజూ 450 మంది వరకు రోగులు చికిత్స నిమిత్తం వస్తుంటారు. ప్రతినెలా కాన్పులతో పాటు జనరల్ సర్జన్స్, ఆర్థో‌తో పాటు ఇతర శస్త్రచికిత్సలు 120 నుంచి 150 వరకు జరుగుతాయి. కొన్నిసార్లు రోడ్డు ప్రమాదాల్లో తీవ్ర గాయాలైన క్షతగాత్రులకు ఎక్కించేందుకు రక్తం అందుబాటులో లేకపోవడంతో ఒంగోలు, గుంటూరుకు రిఫర్ చేయాల్సివస్తోంది. అలా కాకుంటే వినుకొండ, నరసరావుపేటలలోని బ్లడ్ బ్యాంకు నుంచి రక్తాన్ని తెప్పించి ఆ తరువాత ఆపరేషన్లు చేస్తున్నారు.

ప్రభుత్వ ఏరియా వైద్యశాల

బ్లడ్ బ్యాంకుకు వస్తే ఎన్నో లాభాలు..

ఏరియా ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంకును ఏర్పాటు చేసినట్లయితే ఎన్నో లాభాలు చేకూరతాయి. కాన్పులకు సంబంధించిన శస్త్రచికిత్సలు గాని, జనరల్ శస్త్రచికిత్సలు గాని, ప్రమాదాల్లో తీవ్ర గాయాలైన వారికి సంబంధించిన చికిత్సను గాని ఇక్కడ నిర్వహించడానికి వీలుంటుంది. అంతేకాకుండా రక్తదాతల నుంచి రక్తాన్ని ఇక్కడే స్వీకరించవచ్చు. అలాగే యర్రగొండపాలెం పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో, కళాశాలల్లో రక్తదాన శిబిరాలను నిర్వహించి రక్తాన్ని అందుబాటులో ఉంచుకోవచ్చు. యర్రగొండపాలెం పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రులకు కూడా అవసరమైన రక్తాన్ని ఇవ్వడానికి సైతం వీలుంటుంది.

ప్రతిపాదనలు పంపాం: డాక్టర్ దేవర యదిద్య, సూపరింటెండెంట్, ఏరియా వైద్యశాల, వైపాలెం

బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. అధికారులు తనిఖీలు పూర్తి చేసిన అనంతరం బ్లడ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేయడానికి అవకాశం ఉంది. ప్రస్తుతం ఏరియా ఆసుపత్రిలో బ్లడ్ స్టోరేజీ సెంటర్ మాత్రమే ఉంది. రక్తం కావాలంటే ఇతర ప్రాంతాల బ్లడ్ బ్యాంకు నుంచి తీసుకొస్తున్నాం.

కంటి ఆపరేషన్‌ల కోసం తీసుకెళ్తున్న వైద్య సిబ్బంది

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం నంద్యాల శాంతిరాం కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరం ద్వారా అనేకమంది కంటి సమస్యలతో బాధపడుతున్న గ్రామస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించారు. వందమందికి పైగా రోగులకు పరీక్షించి వీరిలో 40 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. ఈ రోగులను శాంతిరాం ఆసుపత్రికి చెందిన ప్రత్యేక వాహనంలో నంద్యాలకు తరలించి అక్కడ ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించి తిరిగి స్వగ్రామాలకు పంపిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వెంకటాద్రిపాలెం ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ వి కోట నాయక్ మాట్లాడుతూ ఇలాంటి శిబిరాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. శాంతిరాం ఆసుపత్రి సేవలు అభినందనీయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కోరికమ్మ, ఆదిలక్ష్మి, నలగాటి వెంకటరామయ్య నాయుడు, శాంతిరాం కంటి ఆసుపత్రి ఏవోలు, రామ్ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ డానియల్ జోసఫ్

యోగాతో మానసిక ఆరోగ్యం

ప్రజాశక్తి-కనిగిరి

శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం బాగుండాలంటే ప్రతి ఒక్కరూ యోగా చెయ్యాలని మున్సిపల్ కమిషనర్ డేనియల్ జోసఫ్ అన్నారు. కనిగిరి పట్టణంలోని సిమ్ స్టడీ సెంటర్లో జెవివి నిర్వహిస్తున్న వేసవి వినోద క్యాంపు కార్యక్రమానికి శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిన్నారులకు పలు ఆరోగ్య సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు స్వర్ణ రమణయ్య చిన్నారులకు యోగా నేర్పించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు వి మాలకొండారెడ్డి, షేక్ ఖాజా హుస్సేన్, జి శ్రీనివాసరెడ్డి, మేడం కోటిరెడ్డి, డి శ్రీను పాల్గొన్నారు.

మైక్ అందజేస్తున్న దృశ్యం

మైక్ బహూకరణ

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల మండలం రాచర్ల ప్రభుత్వ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు 1996-2000 బ్యాచ్ విద్యార్థులు పాఠశాల యందు శనివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి పాఠశాలకు 30 వేల రూపాయల విలువ గల సౌండ్ సిస్టం మైక్‌ను బహుమతి ప్రదానం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిఎల్ రామ్‌నాయక్‌కు మైక్ సెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పి రమణారెడ్డి, పాఠశాల పూర్వ విద్యార్థులు యల్లా చంద్రమోహన్, సిఎ జోసఫ్ కుమార్, ఓ శ్రీనివాసులు, పి శ్రీనివాసులు, పి ఆయుబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు

పారదర్శకంగా రేషన్ పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-రేపల్లె

రేషన్ సరుకులు పంపిణీకి డీలర్లు సమాయత్తం కావాలని తహశీల్దార్ మోర్ల శ్రీనివాసరావు అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఎండియు వాహనాల వలన అవినీతి చోటు చేసుకుంటున్న దృష్ట్యా ప్రభుత్వం వాటిని రద్దుచేసిందన్నారు. జూన్ 1 నుంచి రేషన్ పారదర్శకంగా లబ్ధిదారులకు అందజేయాలన్నారు. ఉదయం 8:00 నుంచి మధ్యాహ్నం 12:00 వరకు అలాగే సాయంత్రం 4:00 నుంచి రాత్రి 8 గంటల వరకు పంపిణీ చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డీలర్లతో సమావేశమైన తహశీల్దార్

పంగులూరు: జూన్ 1వ తేదీ నుంచి పాత పద్ధతిలో రేషన్ పంపిణీ చేయాలని తహశీల్దార్ పి.సింగారావు అన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి నెల ఒకటో తేదీ నుండి 18వ తేదీ లోపు రేషన్ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్వేత, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటి గఫూర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, మండలంలోని రేషన్ షాపుల డీలర్లు పాల్గొన్నారు.

కొల్లూరు: కొల్లూరు మండల తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, వీఆర్వోలతో తహశీల్దార్ బి.వెంకటేశ్వర్లు సమావేశమయ్యారు. జూన్ ఒకటో తేదీ నుంచి రేషన్ షాపుల నుంచి నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలన్నారు.

చీరాల: రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రేషన్ బియ్యం పంపిణీను రేషన్ డీలర్లు అందరూ బాధ్యతగా ప్రభుత్వ నిబంధనలకు లోబడి పంపిణీ చేయాలని తహశీల్దార్ గోపికృష్ణ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. కార్డుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా క్యూలో ఎక్కువ సేపు నిలబెట్టకుండా త్వరగా రేషన్ ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు.

వేమూరు: ప్రభుత్వం ప్రజలకు రేషన్ సరఫరా చేసే వాహనాలను నిలుపుదల చేసిన దృష్ట్యా జూన్ 1వ తేదీ నుంచి రేషన్ సరుకులను డీలర్ల వద్దనే పొందాలని మండల తహశీల్దార్ సుశీల సూచించారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన విధానాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-బట్టిప్రోలు

చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఐలవరంలో శుక్రవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి మాట్లాడుతూ పెరిగిన సాంకేతికతతో యువకులు అనేక విధాలుగా తప్పు దోవ పడుతున్నారన్నారు. సాంకేతికతను సరైన మార్గంలో వినియోగించుకొని సత్ఫలితాలు సాధించాలన్నారు. యువతీ యువకుల తల్లిదండ్రులు కూడా ఎప్పటికప్పుడు వారి పిల్లల మానసిక స్థితిని వారు చేసే పనిని గమనిస్తూ వారిని సరైన మార్గంలో నడిపించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన వివరించారు. సైబర్ నేరగాళ్ల ప్రమేయం సమాజంలో అధికంగా ఉందని వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఈ కార్యక్రమంలో ఎస్సై ఎం.శివయ్య, సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, నాయకులు దీపాల ప్రసాదు, వామనపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన నాలుగో రౌండ్ పొగాకు వేలం

ప్రజాశక్తి-కొండపి

నాలుగో రౌండ్ పొగాకు వేలం శనివారంతో ముగిసిందని వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. నాలుగో రౌండ్ ముగిసే సరికి సరాసరి ధర కిలో రూ.259.17 పలికిందన్నారు. బ్రైట్ రకం సరాసరి ధర కిలో రూ.272.64, మీడియం సరాసరి ధర కిలో రూ.248.48, లోగ్రేడు సరాసరి ధర కిలో రూ.222.89 పలికిందన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు సలహాలు చేశారు. క్లస్టర్ పరిధిలోని చిన్న వెంకన్నపాలెం, వెన్నూరు గ్రామాలకు చెందిన రైతులు 722 బేళ్లను తీసుకుని రాగా 148 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ఠ ధర కేజీ రూ.280, కనిష్ఠ ధర కేజీ రూ.200, సరాసరి ధర కేజీ రూ.255.06గా నమోదయింది. సోమవారం నుంచి ఐదో రౌండ్ పొగాకు కొనుగోళ్లు ప్రారంభం అవుతాయాని వేలం నిర్వహణధికారి సునీల్ కుమార్ తెలిపారు.

వేలం నిర్వహిస్తున్న దృశ్యం

టంగుటూరు: టంగుటూరు పొగాకు బోర్డు వేలం కేంద్రానికి మండల పరిధిలోని ఎం.నిడమాలూరు క్లస్టర్ రైతులు 443 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకువచ్చారు. అందులో 382 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 61 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.280, కిలో అత్యల్ప ధర రూ.205, సరాసరి ధర రూ.247.35 పలికింది.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రకృతి వ్యవసాయం రైతుకు లాభదాయకమని మండల యూనిట్ ఇన్‌చార్జి పి.పెద్దిరాజు తెలిపారు. జరుగుమల్లిలోని రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకతి వ్యవసాయంతో పండించిన ఆకుకూరలు, కాయకూరలు, ధాన్యాలు తీసుకోవడం వల్ల వ్యాధులు రావన్నారు. మహిళలు ఇంటి ఖాళీ స్థలంలో కిచెన్ గార్డెన్ వేసుకొని కూరగాయలు పండించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాసులు, శ్రీలక్ష్మి, ధనలక్ష్మి, రాజ్యలక్ష్మి, అమూల్య, అనుపమ, కోమలి పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న పెద్దిరాజు

రేపల్లె: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని రేపల్లె మండల ప్రాజెక్ట్ రిసోర్స్ పర్సన్ వినయ్ కుమార్ అన్నారు. శనివారం ఉప్పూడిలో నవధాన్యాల సాగు కోసం 15 క్వింటాలు 21 రకాల విత్తనాలను కలిపి 12 కేజీల విత్తన బ్యాగులు తయారు చేశారు. ఒక్కో బ్యాగ్ ఖరీదు రూ.1200 అని తెలిపారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ మాట్లాడుతూ నవధాన్యాల సాగుతో ఎంతో మేలు జరుగుతుందన్నారు. గ్రామాల్లో సేంద్రియ ఎరువులు, ఘన, ద్రవ జీవామృతాలు, కషాయాల తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీ ప్రసాద్ ఐ.సి.ఆర్.పి వెంకటేశ్వర్లు, విజయ్ లక్ష్మి, సామ్రాజ్యం, రైతులు పాల్గొన్నారు.

దివ్యతేజను సన్మానిస్తున్న దృశ్యం

కరాటేలో బాపట్ల వాసికి బంగారు పతకం

ప్రజాశక్తి-బాపట్ల

పుణెలో జరిగిన కూడో ఛాంపియన్ షిప్ పోటీల్లో బాపట్లకు చెందిన దివ్య తేజ బంగారు పతకం సాధించినట్లు మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు తెలిపారు. శనివారం విజయలక్ష్మిపురంలలోని సంఘం కార్యాలయంలో క్రీడాకారుడు దివ్యతేజను సన్మానించారు. మాజీ సైనిక కుటుంబానికి చెందిన దివ్య తేజను ప్రోత్సహిస్తే మరిన్ని పతకాలు సాధించగలరని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు పుట్టా ఆది శేషా రెడ్డి, షేక్ కరిముల్లా, సుంకర శేషగిరి రావు, తోట దుర్గా రావు, అబ్దుల్ రజాక్, కె.ఆంజనేయులు, వల్లూరి భావన్నారాయణ, పసుపులేటి ప్రసాద్, డి.వెంకటేశ్వర్లు, రాంప్రసాద్ రెడ్డి, బసివి రెడ్డి, ఆడే కిషోర్, అడే రాఘవాదేవి పాల్గొన్నారు.

గుండెపోటుతో వాచ్‌మెన్ మృతి

ప్రజాశక్తి - పంగులూరు

సుందర రావు (ఫైల్)

రాత్రి విధులు నిర్వహిస్తున్న వాచ్‌మెన్ గుండెపోటుతో మృతి చెందిన సంఘటన మండలంలోని ముప్పవరం గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. ముప్పవరం గ్రామానికి చెందిన కొలకలూరి సుందరరావు గత ఆరు సంవత్సరాల నుంచి స్థానిక బ్రహ్మయ్య పొగాకు కంపెనీలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఎప్పటిలాగే డ్యూటీకి వెళ్ళాడు. ఉదయాన్నే లోడ్ చేసుకునేందుకు వచ్చిన లారీ డ్రైవర్లు వాచ్‌మెన్‌ను ఎంత లేపినా లేవకపోవడంతో మృతి చెందినట్లు నిర్ధారించుకుని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. సుందర్ రావు భార్య సంతోషం గతంలోనే మరణించగా, కుమారుడు సామ్సన్ ఉన్నారు.

బస్సు ఢీకొని గేదె మృతి

ప్రజాశక్తి-పంగులూరు

ఏపీఎస్ఆర్టీసీ బస్సు ఢీకొని ఒక గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని బైట మంజు లూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం జరిగింది. ఆర్‌టీసీ బస్సు ఒంగోలు నుంచి విజయవాడ వైపు వెళుతూ ఉండగా బైట మంజులూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న గేదెల గుంపును బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒక గేదె చనిపోయింది. వెంటనే హైవే మొబైల్ సిబ్బంది వచ్చి రహదారి ట్రాఫిక్కుకు అంతరాయం లేకుండా క్రేన్‌తో గేదెను తొలగించారు. ప్రమాదం జరిగే సమయంలో బస్సుకు తాళ్లూరు గ్రామానికి చెందిన పి.వెంకట్రావు డ్రైవర్‌గా ఉన్నట్లు హైవే అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

మృతులకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-బాపట్ల

కొమరోలు మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతులకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ నివాళులు అర్పించారు. శనివారం స్టువర్టుపురానికి చేరుకున్న మృతదేహాల అంతిమ యాత్రలో ఆయన పాల్గొన్నారు. మృతదేహాలు స్టువర్టుపురం చేరుకోగానే మృతుల బంధువులు బోరున విలపించారు. మృతుల కుటుంబాలకు నరేంద్ర వర్మ తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలను అన్ని విధాల ఆదుకునేందుకు ప్రభుత్వ పరంగా తమ వంతు సహకారం అందిస్తామన్నారు.

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రేపల్లె

అగ్నిప్రమాద బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు శివప్రసాద్ అన్నారు. పట్టణంలోని 26వ వార్డులో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కొలుసు సాంబశివరావు కుటుంబాన్ని శనివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో జమీర్ డొక్కు, బుజ్జి రామారావు, నాయకులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ గోపీనాథ్

క్వాలిటీ కంట్రోల్ అధికారుల తనిఖీ

ప్రజాశక్తి-చీమకుర్తి

మండలంలోని మంచికలపాడు, మువ్వవారిపాలెంలలో ఫామ్ పాండ్ మరియు కాటిల్ ట్రఫ్ పనులను రాష్ట్ర చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ బి.గోపీనాథ్ తనిఖీ చేశారు. శనివారం ఆయన డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ జోసఫ్ కుమార్, ఎంపీడీవో రాఘవేంద్రలతో కలిసి ఆయా గ్రామాలలో నీటి తొట్లను, పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. వాటి పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ఫారం పాండ్స్ 314 మంజూరు కాగా వాటిలో 61 ప్రోగ్రెస్‌లో ఉన్నాయని, 36 పూర్తయినట్లు తెలిపారు. క్యాటిల్ ట్రఫులు 14 మంజూరు కాగా 14 పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-కొండపి

కొండపిలో నేడు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. కొండపిలోని స్థానిక బస్టాండ్ ఎదురు కుమ్మరిపాలెంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వెంకటరమణ నర్సింగ్ హోమ్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో పలు సమస్యలపై ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఈ శిబిరాన్ని మండలంలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలి

ప్రజాశక్తి-అమృతలూరు

గ్రామాలలో ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని ఎంపీడీవో మారుతి శేషమాంబ సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలో ప్రారంభమైన గ్రామసభ ముందుగా శనివారం ప్యాపరు, కూచిపూడి, బోడపాడు, ఎడవూరు గ్రామంలో నిర్వహించారు. ప్యాపరు, కూచిపూడి గ్రామంలో జరిగిన గ్రామ సభలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీవో మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణకు గ్రామ అధికారులతో పాటు ప్రజలు కూడా తోడ్పడునందించాలన్నారు. పరిశుభ్రతను పాటించటం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చునని, అదే రీతిలో ప్రతి ఒక్కరు మక్కలు నాటి పచ్చదనాన్ని కూడా పెంపొందించాలని ఆమె కోరారు. ఈయన 24 నుండి 28 వరకు జరిగే గ్రామసభలలో అధికారులతో పాటు ప్రజలు కూడా విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో

పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న అధికారులు

ఆయా గ్రామ సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

కర్లపాలెం: గ్రామ పంచాయతీలలో పారిశుధ్య లోపం జరిగితే ఉపేక్షించేది లేదని కర్లపాలెం ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. చింతాయపాలెం పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. రోడ్లకి ఇరువక్కల ఉన్న ఇళ్లలోంచి వస్తున్న మురుగునీటిని రోడ్లపైకి పంపిస్తే చర్యలు తీసుకుంటామని జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ప్రణాళిక బద్ధంగా పనులు చేపట్టి, దోమలను నివారించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే పర్యావరణ కాలుష్యాన్ని మరియు వ్యాధి ప్రమాదాన్ని అరికట్టగలమని అన్నారు. పేరలి పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూపిసి సెంటర్ అందుబాటులో లేకపోవడంతో దానికి సంబంధించిన స్థల సేకరణను ప్రారంభించారు. ఘన వ్యర్థాల నుంచి సంపద సృష్టించడానికి త్వరలోనే షెడ్ పనులను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీఆ శ్రీనివాసరావు, చింతయపాలెం సర్పంచ్ పిటా శ్రీనివాసరావు, కార్యదర్శి అరుణ్ బాబు, పేరలి సర్పంచ్ ఆదం, కార్యదర్శి వీరస్వామి రెడ్డి, వీఆర్వో రాజు తదితరులు పాల్గొన్నారు.

బైకు అదుపుతప్పి ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-పంగులూరు

బైకు అదుపుతప్పి ముగ్గురికి గాయాలైన సంఘటన పంగులూరు మండలంలోని బైట మంజులూరు సమీపంలో జాతీయ రహదారిపై శనివారం జరిగింది. అద్దంకి మండలం దేనువకొండ గ్రామానికి చెందిన ప్రేమ సాగర్, కే.పూర్ణమ్మ, కే.మెషక్‌లు బైకుపై చిలకలూరిపేట నుంచి అద్దంకి వెళ్తున్నారు. జాతీయ రహదారిపై బైట మంజులూరు సమీపంలోకి రాగానే బైక్ అదుపు తప్పి ముగ్గురు కింద పడిపోయారు. ముగ్గురికీ గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న హైవే మొబైల్ సిబ్బంది క్షతగాత్రులను అద్దంకి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రేణింగవరం ఎస్సై వినోద్ బాబు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి పనితో కాలువల అభివృద్ధి

ప్రజాశక్తి-పంగులూరు

మట్టి, గడ్డితో పూడుకుపోయిన పంట కాలువలను ఉపాధి హామీ పథకం ద్వారా పూడిక తీస్తున్నారు. రానున్న వ్యవసాయ సీజన్లో పంట కాలువలో సాగునీరు పారేందుకు వీలుగా పంట కాలువలు బాగు చేస్తున్నారు. మండలంలోని 21 గ్రామాల్లో పంట కాలువలను ఉపాధి కూలీల ద్వారా పనిచేయిస్తున్నట్టు ఏపీవో కే.సంతోషం తెలిపారు. ఆయా గ్రామాల్లోని కూలీలకు పనులు చూపించేందుకు పంట కాలువలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ఆమె అన్నారు. ఉపాధి కూలీలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. వందరోజుల హాజరుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. కాగా పనులు ప్రారంభించి నాలుగు వారాలు గడుస్తున్నా కూలీ డబ్బులు రాలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే ఉపాధి కూలీ డబ్బులను వేయాలని, తమ ఇబ్బందులను తీర్చాలని కూలీలు కోరుతున్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతోంది. శనివారం నాటి కార్యక్రమంలో విద్యార్థులచే కథలు చెప్పించడం, పుస్తకాలు చదివించడం, చిత్రలేఖనం, చదరంగం వంటివి నేర్పించడం జరిగింది. వివిధ రకాల ఆటలు ఆడించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేతివ్రాత శిక్షణ కార్యక్రమం ప్రత్యేకంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులకు చేతివ్రాత సామాగ్రిని ఈ సందర్భంగా ఉచితంగా అందజేశారు. గ్రేడ్-1 గ్రంథపాలకుడు జివి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మార్కాపురం అధ్యక్షుడు టి.వి.రామకృష్ణారావు, హ్యాండ్ రైటింగ్ ట్రైనర్ సిహెచ్.తిరుపాలయ్య పాల్గొన్నారు.

టంగుటూరు: గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో శనివారం క్రమశిక్షణ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యస్.కృష్ణారావు, గ్రంథపాలకుడు గుమ్మడి వర్ధన రాజు, పాల్గొన్నారు.

జగన్ పర్యటనను జయప్రదం చేయండి

ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పొదిలిలో పర్యటించనున్న నేపథ్యంలో స్థానిక వైసీపీ శ్రేణులతో సమావేశాన్ని శనివారం యర్రగొండపాలెంలో తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా రైతులు ముఖ్యంగా పొగాకు సాగు చేసే రైతులు తీవ్రంగా నష్టాల పాలవుతున్నారు. పెట్టుబడులు పెరుగుతున్నప్పటికీ మార్కెట్‌లో ధరలు తగ్గిపోతున్నాయన్నారు. దీనివల్ల రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారని తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పొదిలిలో పర్య టించి పొగాకు రైతులతో నేరుగా మాట్లాడతారని తెలిపారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్

వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తైనట్లు తెలిపారు. గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమం వైసీపీ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, సర్పంచ్ రామావత్ అరుణాబాయి, మండలాల కన్వీనర్లు ఏకుల ముసలారెడ్డి, గంటా వెంకట రమణారెడ్డి, నాయకులు ఆళ్ల ఆంజనే యరెడ్డి, జబివుల్లా, సింగా ప్రసాద్, కొర్రపోలు జయరావు, ఓబుల్‌రెడ్డి, పాలిరెడ్డి కృష్టారెడ్డి, వలి, సరళ కుమారి తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే కులగణన

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర రావు

ప్రజాశక్తి-రేపల్లె

పోరాటాల ఫలితంగానే కేంద్రప్రభుత్వం కుల గణన చేపట్టిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర రావు అన్నారు. శనివారం రేపల్లె పట్టణంలోని బేతపూడిలో శారద ఐటిఐ కాలేజీలో బీసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ రేపల్లె నియోజకవర్గంలో 70 శాతం బీసీలు ఉన్నారని ఇక్కడ ఏ పార్టీ తరపున పోటీ చేసినా ఎమ్మెల్యేగా వెనుకబడిన తరగతుల వారే అవుతారన్నారు. బీసీ సంక్షేమ సంఘం రేపల్లె నియోజకవర్గం గౌరవాధ్యక్షులుగా చెన్ను నాగమల్లేశ్వరరావును నియమిస్తున్నట్లు సమావేశంలో ప్రకటించారు. ఈ సమావేశంలో శారద ఐటిఐ కాలేజ్ కరస్పాండెంట్ బడుగు వెంకటనారాయణ, రాష్ట్ర

నాగమల్లేశ్వరరావుకు నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

ఎంప్లాయిస్ అధ్యక్షులు ఎన్‌వియస్ మూర్తి, ఎన్టీఆర్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మేక వెంకటేశ్వరరావు, కేసన రాంబాబు, ఉయ్యూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల చట్టాలపై అవగాహన

ఆరవ అదనపు జిల్లా జడ్జి శుభవాణి

ప్రజాశక్తి-మార్కాపురం

మహిళలపై ఇటీవల కాలంలో లైంగిక వేధింపులు, దాడులు అనేకం జరుగుతున్నాయని మార్కాపురంలోని ఆరవ అదనపు జిల్లా జడ్జి ఎం.శుభవాణి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయన్నారు. లైంగిక వేధింపుల చట్టం-2013పై ప్రధానంగా మహిళలకు అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. లైంగిక దాడికి గురవుతున్న మహిళలు నిర్భ యంగా కోర్టు ద్వారా న్యాయ సహాయం పొందవచ్చు అని తెలిపారు. పారా లీగల్ వాలంటీర్ ఈ చట్టంపై మహి ళలకు అవగాహన కల్పించి న్యాయ

మాట్లాడుతున్న జిల్లా జడ్జి శుభవాణి

సహాయం చేయాలని సూచించారు. న్యాయం కోసం వచ్చిన బాధితులకు అండగా మనోధైర్యాన్ని నింపాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాదులు పైడిమర్రి రామచంద్ర, ఆకుల ఉష్షశ్రీ, షేక్ మహబూబా అలీ, ఎ.ఝాన్సీరాణి, సురేష్, పారా లీగల్ వాలంటీర్లు ఆదినారాయణ, బాషా, పవన్ పాల్గొన్నారు.

రామకృష్ణ శాస్త్రిని సన్మానిస్తున్న గ్రామస్థులు

రామకృష్ణ శాస్త్రికి సన్మానం

ప్రజాశక్తి-టంగుటూరు

జ్యోతిష్యంలో గౌరవ డాక్టరేట్ పొందిన జరుగుమల్లి మండలం నర్సింగోలులోని ప్రత్యేక శనీశ్వరాలయం ప్రధాన అర్చకులు పైడిపాటి వెంకట రామకృష్ణశాస్త్రిని హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా గ్రామ ప్రజలు ఘనంగా సత్కరించారు. పరాశర అకాడమీ ఆఫ్ ఆస్ట్రాలజికల్ సైన్స్ వారు ఈనెల 19వ తేదీన హైదరాబాద్‌లోని త్యాగరాజ గానసభలో పద్మశ్రీ డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ గౌరవ డాక్టరేట్‌ను రామకష్ణ శాస్త్రికి అందజేశారు. డాక్టర్ జంధ్యాల చంద్రభాస్కర శాస్త్రి వద్ద జ్యోతిష్యాన్ని నేర్చుకొని గత రెండు దశాబ్దాలుగా జ్యోతిష్యంపై విశేష పరిశోధనలు చేస్తూ ఉత్తమ ఫలితాలు సాధించినందుకు గౌరవ డాక్టరేట్‌ను అందజేసినట్లు రామకష్ణశాస్త్రి తెలిపారు. గ్రామంలోని ప్రసన్నాంజనేయ స్వామి 35వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్తు ప్రభపై గ్రామస్థులు రామకష్ణశాస్త్రిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వెంకట శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సినిమా డైరక్టర్ జంధ్యాల మల్లికార్జునశాస్త్రి, గ్రామస్థులు పాతూరి కోటేశ్వరరావు, పావులూరి సుబ్బారావు, పావులూరి నాగేశ్వరరావు, చెన్నారెడ్డి మాలకొండయ్య, పావులూరి వెంకట శేషారావు, కుటుంబ సభ్యులు, అభిమానులు, తదితరులు ఘనంగా సత్కరించారు. ప్రభపై ఏర్పాటు చేసిన చవటపాలెం గంగా భవానీ ప్రసాద్ ఆధ్వర్యంలో కళాకారులు చేసిన కోలాటం అలరించింది.

వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డాక్టర్ బి జవహర్

నేడు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-చీమకుర్తి

పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వారోత్సవాలలో భాగంగా ఆదివారం జవహర్ నర్సింగ్ హోమ్‌లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జి.దేవరాజులు తెలిపారు. శనివారం జవహర్ నర్సింగ్ హోమ్ ఆవరణలో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ బి జవహర్ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. గత రెండేళ్లుగా ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఏర్పాటు చేసి రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జి.దేవరాజులు మాట్లాడుతూ గత రెండేళ్లలో భగత్ సింగ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో 400 మందికి పైగా రక్తదానం చేయడం జరిగిందన్నారు. ఆదివారం రక్తదాన శిబిరంలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యురాలు డాక్టర్ బి.శారద, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు పూనపాటి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మహానాడుకు తరలిరావాలి

డాక్టర్ కడియాల లలిత సాగర్

ప్రజాశక్తి-దర్శి

దర్శిలోని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ నివాసం వద్ద శనివారం జరిగిన సమావేశంలో ఈ నెల 27, 28, 29వ తేదీల్లో కడపలో జరిగే మహానాడుకు దర్శి నియోజకవర్గం నుంచి భారీగా తరలి రావాలని టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత సాగర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ తిండి రాజేష్, మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి పాపారావు, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి మార్కెట్ యార్డ్ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న మంత్రులు

మంత్రుల పరిశీలన

ప్రజాశక్తి-యద్దనపూడి

మండలంలోని సూరవరపుపల్లి గ్రామ పరిధిలోని పొలంలో మండె వేసి ఉన్న కోయ సతీష్‌కు చెందిన బర్లీ పొగాకును శనివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, విధ్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, స్థానిక శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు పరిశీలించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు రైతు సతీష్‌ను అడిగి పంట పండించటంలో పడిన ఇబ్బందులు, ప్రస్తుతం ఎంత రేటుతో కొంటే రైతులు నష్టపోకుండా ఉంటారనే విషయాలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి రైతులకు నష్టం లేనివిధంగా చూస్తామన్నారు. పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం కషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ గ్లోరియా, యద్దనపూడి తహశీల్దార్ రవికుమార్, యం.డి.ఒ పి.టి.వి.కష్ణ, మండల ఎఒ మేరిమ్మ, డి.టి విష్ణు పాల్గొన్నారు.

నేడు వైసిపి నియోజకవర్గ విస్తృత సమావేశం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఈ నెల 25న ఆదివారం నాడు జరగనున్న వైసిపి ఒంగోలు నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు విజ్ఞప్తి చేశారు. శనివారం సాయంత్రం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఒంగోలు నగర పార్టీ అధ్యక్షులు కఠారి శంకరరావు, ఒంగోలు రూరల్ మండల అధ్యక్షులు మన్నె శ్రీనివాసరావు ఇతర నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వాతావరణ అనుకూల పరిస్థితుల కారణంగా జిల్లా పార్టీ కార్యాలయ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేయతలపెట్టిన సమావేశం పాతబైపాస్ సాయి ఐటిసి వద్దకు మార్చినట్లు తెలిపారు. ఈ మార్పు విషయం నగర పరిధిలో 46 డివిజన్ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులకు సమాచారం ఇవ్వామన్నారు. ఈ మార్పును గమనించి నియోజకవర్గ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు సాయంత్రం 4 గంటలకు సాయి ఐటిసి వద్దకు చేరుకోవాలన్నారు. పార్టీ ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరు రవిబాబు అధ్యక్షతన జరిగే ఈ విస్తత స్థాయి సమీక్షాసమావేశానికి రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, రీజనల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, వై.పాలెం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. సమావేశంలో వైసిపి చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి జి వెంకటేశ్వర్లు (చిన్న),జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు నగరకంటి శ్రీనివాసరావు, వాలంటరీ విభాగం అధ్యక్షులు ఎన్ జనార్ధన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

31న జడ్పీ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు దక్షిణ బైపాస్ రోడ్డులోని పాత జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 31న ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని జడ్పీ సిఇఒ బి.చిరంజీవి ఓ ప్రకటనలో తెలిపారు. జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన జరిగే సమావేశంలో జిల్లా మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. సమావేశానికి జిల్లా అధికారులు సమగ్ర సమాచారంతో హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు: ఎస్ఇ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విద్యుత్ వినియోగదారుల కోసం రేపు సెలవు రోజు ఐయనకూడా విద్యుత్ బిల్లులు చెల్లించడానికి వీలుగా జిల్లాలోని అన్ని విద్యుత్ బిల్లు కట్టించుకునే కౌంటర్లు ఓపెన్ గా వుంటాయని ప్రకాశం జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ కట్టా వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఫోన్ పే, డిపార్ట్మెంట్ ఆప్ ద్వారా కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు.

మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

యోగా సాధనపై

10 లక్షల మందికి అవగాహన

- యోగాను జీవన విధానంగా అలవర్చుకోవాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని.. యోగాంధ్ర-2025 మాసోత్సవాల్లో భాగంగా జిల్లాలో 10 లక్షల మందికి యోగ సాధనపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. యోగాంధ్ర-2025 మాసోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ప్రకాశం భవనం ఎదురుగా ఏర్పాటుచేసిన యోగా రోడ్డులో కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, నగర మేయర్ గంగాడ సుజాత, సంయుక్త కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణతో కలిసి యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 21వ విశాఖపట్టణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొంటున్నారని, ఇందులో 5 లక్షల మంది ప్రజలు పాల్గొంటారన్నారు. జిల్లాలోని ప్రధాన మున్సిపాలిటీలలో, మండల కేంద్రాల్లో ఒక రోడ్డును యోగ రోడ్డు గా ప్రకటించి అక్కడ ప్రతి రోజు ఉదయం యోగ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు, ఒంగోలు ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వర రావు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ సక్రమంగా చేయాలి

జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

చౌకదుకాణాల ద్వారా రేషన్ పంపిణీ సక్రమంగా చేయాలని, ఏ ఇతర డైవర్షన్ జరిగినా సంబంధిత డీలర్‌పై చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ హెచ్చరించారు. జూన్ 1 నుంచి చౌకదుకాణాల ద్వారా రేషన్ పంపిణీకి సంబంధించి మండలాల వారీ రేషన్ డీలర్ల అసోసియేషన్ సభ్యులతో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ శనివారం సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్ పంపిణీ చేయాలన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు జేసీని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డిఎస్ఒ పద్మశ్రీ, జిల్లా మేనేజర్ వరలక్ష్మి, ఒంగోలు నగర రేషన్ డీలర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ బెజవాడ మురళీకృష్ణ, సెక్రటరీ సండూరు చంద్ర, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

జేసీని సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

యువత ఉద్యోగాలందించే స్థాయికి ఎదగాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

నేటి యువత ఉద్యోగం అందుకునే స్థాయి నుండి ఉద్యోగాలు అందించే స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. శనివారం ఒంగోలు నాగార్జున డిగ్రీ కళాశాలలో మెప్మా, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యుల పిల్లలకు ప్రత్యేకంగా జాబ్ మేళా నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ మెప్మా సభ్యులకు ప్రత్యేకంగా జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ, మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్ మేళా కార్యక్రమాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఒంగోలు మున్సిపల్ కమిషనర్ కె. వెంకటేశ్వర రావు, మెప్మా పిడి శ్రీహరి, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి జి.రవి తేజ, నాగార్జున డిగ్రీ కళాశాల ఛైర్మన్ రాంప్రసాద్ మాట్లాడారు. ఈ జాబ్ మేళా లో దాదాపు 40 ప్రైవేట్ కంపెనీలు పాల్గొనగా, 1200 నిరుద్యోగ యువత తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నారు. అనంతరం మెప్మా ఆధ్వర్యంలో 10 ఎలక్ట్రికల్ బైక్స్, 10 ఎలక్ట్రికల్ ఆటోలను స్వయం సహాయక సంఘాల సభ్యులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా నగర మేయర్ గంగాడ సుజాత తో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్టెప్ సిఇఒ శ్రీమన్నారాయణ, జిల్లా అర్బన్ సమాఖ్య ప్రతినిధి భారతి, స్వయం సహాయక సభ్యులు, వారి పిల్లలు పాల్గొన్నారు.

బదిలీ దరఖాస్తుకు గడువు పెంపు

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

పాఠశాలల స్కూల్ అసిస్టెంట్ల బదిలీ దరఖాస్తు గడువును 25 వరకు పెంచుతూ రాష్ట్ర విద్యా శాఖ శనివారం రాత్రి ఆదేశాలు జారీ చేసింది. ఇంతకు క్రితం ఇచ్చిన ఆదేశాల ప్రకారం నేటితో గడువు ముగిసింది. అయితే సాంకేతిక సమస్యలు, ఇతర కారణాల రీత్యా ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి మేరకు దరఖాస్తు గడువు 25 ఆదివారం రాత్రి 11.45 వరకు గడువు పొడిగిస్తూ ఆదేశాలిచ్చింది. ఈ అవకాశం ఉపాధ్యాయులు వినియోగించుకోవాలని సూచనలు చేసింది.

బర్లీ పొగాకు రైతుల కష్టాలు తీరేనా?

బ్లాక్ బర్లీ పొగాకు సాగుతో తీవ్రంగా నష్టపోయామని కనీస మద్దతు ధరతో పొగాకు కొనుగోళ్లు జరిగేలా చూడాలంటూ రైతులు ప్రభుత్వానికి పలు మార్గాల్లో విన్నపాలు చేయడంతో పాటు నిరసన కార్యక్రమాలు, ధర్నాలు, రాస్తా రోకో చేశారు. రాష్ట్ర వ్యవసాయ మంత్రి నేతృత్వంలో సమావేశాలు జరిగాయి. ముఖ్యమంత్రి పొగాకు రైతుల సమస్యపై సమీక్ష చేశారు. అయినా పొగాకు కంపెనీల వారు ముందుకు రావడం లేదు. ప్రభుత్వం వారిపై ఒత్తిడి చేయ లేకపోతుంది. అప్పులపాలయిన రైతులు ఆత్మస్థైర్యాన్ని కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పొగాకు రైతుల సమస్యలపై ప్రతిపక్ష నేత జగన్ ప్రకాశం జిల్లా పొదిలికి ఈ నెల 28న రానున్న నేపథ్యంలో ఈ లోపు పొగాకు రైతుల సమస్యలకు పరిష్కారం చూపాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తూ శనివారం మంత్రుల బృందాన్ని పర్చూరు నియోజకవర్గానికి పంపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ వచ్చారు. సూరారపల్లిలో పొగాకు మండెలను పరిశీలించారు. మార్టూరులో పర్చూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బ్లాక్ బర్లీ పొగాకు రైతులు, బయ్యర్లుగా ఉన్న కంపెనీ ప్రతినిధులతో ముఖాముఖి నిర్వహించారు.

బ్లాక్ బర్లీ పొగాకును రెండు గ్రేడ్లతో కామన్ వెరైటీ క్వింటా ధర రూ.12 వేలకు, లో గ్రేడ్ రకాన్ని రూ.6 వేలతో కొనుగోలు చేయాలని ధరలను నిర్ణయించారు. మరి పొగాకు కంపెనీల వారు ప్రభుత్వం మాట ఏమేరకు వింటారో వేచి చూడాల్సి ఉంది.

మితిమీరిన వేగంతో వాహనాలు నడపడంతో ప్రతి రోజూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రకాశం జిల్లా తాడిచెర్లమోటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బాపట్ల జిల్లా స్వర్ణపురంకు చెందిన ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. ఇన్నోవా వాహనంలో మహానంది వెళ్ళి తిరిగి వస్తూ వేగంగా ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. చీరాల వాడరేవు రోడ్డులో కారు బోల్తా పడి ముగ్గురు యువకులు మతి చెందారు. వేగంగా వెళుతున్న సమయంలో టైరు పేలి కారు బోల్తా పడిన కారణంగా ఈ ప్రమాదం సంభవించింది. విద్యార్థులు కొందరు సరదాగా వాడరేవు వచ్చి వెళుతూ ఈ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం చింతకుంట్ల గ్రామం దగ్గర వాహనం ఢీ కొట్టడంతో ఇద్దరు వద్దులు అక్కడికక్కడే మతిచెందారు. పంగులూరు వద్ద కారు ఢీ కొన్న ఘటనలో ఇరువురు మరణించారు. పాకలలో ఆటో బోల్తా పడి యువకుడు మరణించాడు. పెదనందిపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చీరాలకు చెందిన కానిస్టేబుల్ మరణించారు. జరిగిన ఈ రోడ్డు ప్రమాదాలు అన్నిటికి మితిమీరిన వేగమే కారణంగా ఉంది. రోడ్డు ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో అత్యధిక మరణాలతో పాటు, గాయపడిన వారు ఉంటున్నారు.దీంతో కుటుంబాలు ఆర్థికంగా కోలుకోలేని పరిస్థితి నెలకొంటుంది.

నారాయణపూర్ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్లో చీరాలకు చెందిన సజ్జా నాగేశ్వరరావు అలియాస్ నవీన్ మృతిచెందాడు. మావోయిస్టు పార్టీ మిలిటరీ విభాగంలో అవామ్-ఇ-జంగ్ పత్రిక ఎడిటోరియల్ చీఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న నాగేశ్వరరావు చీరాల మండలం, జాండ్రపేటకు చెందిన చేనేత కుటుంబానికి చెందినవాడు. గత 36 ఏళ్లుగా విప్లవోద్యమంలో అజ్ఞాత జీవితం గడుపుతూ ఎన్‌కౌంటర్లో మరణించారు. ఆయన మృతదేహాన్ని బంధువులకు అప్పజెప్పేందుకు ప్రభుత్వం నిరాకరించడంతో కోర్టును ఆశ్రయించారు.

గత ప్రభుత్వ హయాంలో ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో జరిగిన ఇసుక తవ్వకాలపై కూటమి ప్రభుత్వం విచారణ చేపట్టింది. ఈ మేరకు 2021 నుంచి 2024 సంవత్సరం వరకు జరిగిన ఇసుక అక్రమ తవ్వకాల గురించి ఉపగ్రహ ఛాయాచిత్రాల ద్వారా ప్రభుత్వం గుర్తించింది. ఏపీసాక్ నివేదిక ఆధారంగా జెపి వెంచర్స్ ఏజెన్సీకి షోకాజ్ నోటీసులు ఇవ్వడంతో పాటు ప్రత్యేకంగా సిట్ ఏర్పాటు చేసి విచారణ జరపనుంది.

- ప్రజాశక్తి, బాపట్ల జిల్లా